


# తీరని సందేహం

సిహెచ్. డి వర్ధనచౌదరి

రాత్రి ప్రొద్దుపోయి పడుకోవటం వలన ఉదయం 8 గం॥లకుగాని మెలకువ రాలేదు. అదైనా 'శ్రీ' బొమ్మల చప్పుడుకి తప్పనిసరిగా లేవాల్సి వచ్చింది. బద్దకంగా లేచి లోపలి గదిలోకి వెళ్లాను. మా అన్నయ్యగారి చిన్నాడితో ఆడిస్తూ ఒక ఆరేడు సం॥ల బాబు కనిపించాడు. ఎఱ్ఱగా చాలా అందంగా వున్నాడు. కొందర్ని చూస్తే ఎందుకో చెప్పలేని ఆత్మీయతఏర్పడుతుంది."ఎవర"ని అమ్మనడగాను.

"ప్రక్కింటివాళ్ళ బాబు" అని చెప్పింది.

మొహం కడుక్కుని కాఫీ త్రాగుతూ అమ్మను అడిగాను. "వాళ్ళకింత చిన్నబ్బాయి లేడనుకుంటా"

"ఆవిడ అన్నగారబ్బాయి. మొన్నీమధ్యనే వచ్చాడు."

"సీట్‌గా ఎంత బావున్నాడోచూడు. మనవాళ్ళు వున్నారు..."

"ప్చ్. పాపం. ఏం ప్రయోజనం." ఎందుకో నిట్టూర్చింది.

"ఏమయింద"ని అడిగాను.

"వాళ్ళమ్మను గుంటూరాస్పత్రిలో చేర్చారు"

"ప్చ్. ఏమిటో సరిగ్గా చెప్పరాదూ. అర్థం కాకుండా చెప్తే"

"రెండు మూడు సంవత్సరాల నుంచీ కాన్సరుతో బాధపడుతోందట. విండా పాతికేళ్ళయినా లేవు. మొన్నీమధ్యనే వాళ్ళూరు వెళ్ళినప్పుడు చూశాను. చక్కగా మాట్లాడింది. మర్యాదస్తురాలు. లాభం లేదనుకుంటున్నారు. జబ్బు ముదిరిపోయిందట."

"మరితను వాళ్ళమ్మను విడిచిపెట్టి ఉంటాడా"

"చక్కగా ఎక్కడైనా వుంటాడట! బహు పెంపకం అలాంటిది" ఎందుకో బాబుని చూస్తుం జాలేసింది.

* * *

"ఉప్మా తిందాంరా బాబూ" అన్నానో రో వుదయం.

"మాఇంట్లో టిఫిన్ తినే వచ్చాను"

"ఏం టిఫిన్"

"పూరీ"

"మాఇంట్లో ఉప్మాగా మరి : కొద్దిగా తిందు గాని రా" అన్నాను. కనీసం వారానికి నాలు సార్లైనా మా ఇంట్లో ఉండే ఉప్మాను తినాలంటే నాకు ప్రాణసంకటం. నా వాటాలో కాస్త తగ్గిన తగ్గినట్లే కదాని కొంత ఆశ. కాని ఆ ఆశలే

ఫలించలేదు.

"నేను ఉదయం ఒక్కసారే తింటాను టిఫిను. మా అమ్మ ఎప్పుడుపడితే అప్పుడు పెట్టదు" అన్నాడు.

"తర్వాతింకేం తినవా ?"

"మధ్యాహ్నం అన్నం, సాయంత్రం టిఫిను, మళ్ళీ రాత్రికి అన్నం, పడుకునేముందు పాలు త్రాగుతాను" అన్నాడు. నిజంగా ఆశ్చర్య పోయాను. తిండి విషయంలో అంత క్రమశిక్షణతో చిన్నప్పట్నించీ పెంచే వారరుదు మా యింట్లో చూస్తే ఎప్పుడూ ఏదో మేత వదేస్తుండాల్సిందే. చివరికి 104 డిగ్రీల చలిజ్వరం ఉన్నా సరే, పిల్లలకి బిస్ప్రూట్లు యింకా యింకా కొని పెడ్తూనే వుంటాను.

"మరీ అలవాట్లన్నీ ఎవరు నేర్పారు" కుతూహలంగా అడిగాను,

"మా అమ్మ."

"మీఅమ్మ దగ్గర ఎప్పుడూవుండాలనిపించదా'

"ఊహూ, అట్లా చేస్తే కొట్టుందికూడ. అందుకనేగా మా అత్తయ్య నానమ్మల దగ్గిరే ఉంటాను" అన్నాడు,

చనువు ఎక్కువయి పాడవుతారనేమో అనుకున్నాను.

* * *

ఇలా రోజూ కబుర్లు చెప్తుండేవాడు. అడిగిన వాటికి అంత చిన్న వయస్సులో కూడ చక్కగా జవాబులిస్తుంటాడు. బాబుని చూస్తుంటే అందరికీ ముద్దుగా వుంటుంది.

మా చిన్నాడు మేలుకుని ఉన్నప్పుడు బొమ్మల్తో వాణ్ణి ఆడించటం నిద్రపోయినప్పుడు ప్రక్కింటి చిన్నపిల్లల్తో ఆడుకోవటం కార్యక్రమం అయిపోయింది ఇక్కడకు వచ్చిం దగ్గర్నుంచీ బాబుకి. ఏ ఈడు పిల్లలకి వారే జత. ప్రతి పనిలోనూ చురుకుదనం కనిపిస్తుండేది,

ఒకరోజు అమ్మావాళ్ళు బాబు అమ్మగురించి మాట్లాడుకుంటుంటే విన్నాను ప్రక్కింటి వాళ్ళంతా గుంటూరు వెళ్ళారట చూడ్డానికి. మనంకూడ వెళ్తే బావుండేది అనుకుంటున్నారు. వీళ్ళకిలాటి ఆలోచనలు ముందు రావు. తర్వాత వస్తే యిలా వాపోతూనే కాలక్షేపం మాత్రం చేస్తారు. అసలు చాలా కాలం నుంచి అనుమానంగానే వుందట. కాని యిప్పట్నించీ అందరికీ తెలియటం ఇష్టంలేక బాగానే ఉంటోందని చెప్తున్నారట.

రాత్రికి గుంటూరునుంచి వచ్చారు వాళ్ళు ప్రక్కనుండి విన్నాను కాస్త సీరియస్‌గానే వుందట. అమ్మతో మాట్లాడుతూ లాభంలేదన్నట్టు పెదవి విరిచారు. బాబు గుర్తొచ్చాడు. మనసంతా బాధతో నిండిపోయింది.

ఆవిడకు బాబుని చూడాలని ఉండదా ఏమిటి ! కన్నకొడుకుని ఎవరైనా దూరంగా ఉంచటాని కిష్టపడతారా ! అసలు రెండు మూడేళ్ళ క్రితం వరకూ క్షణం కూడ వదలకుండా ఎత్తుకొని ముద్దులాడ్తుండేదట. తర్వాతనుంచీ దగ్గరకు కూడా సరిగా తీసుకోవటం లేదట" ఇన్ఫర్మేషనంతా లాగి ఇంట్లోకొచ్చి కామెంట్లు మొదలెట్టారు. బాబుని బాగా అలవాటు చేసుకుంటే ఒకవేళ ఎప్పుడైనా తనకేమైనా జరిగితే ఆబాధ తట్టుకోలేడని ఆవిడే ఈవిధంగా దగ్గరివారి కలవాటు చేస్తూ పెంచుతుందేమోఅనిపించింది నాకు ఆవిడ దూరదృష్టికి తెలివితేటలకి మరోసారి ఆశ్చర్యపోయాను

తర్వాత రెండురోజులవరకూ బాబు కనిపించలేదు. కారణం అడిగితే 'గుంటూరు తీసికెళ్ళారు. వాళ్ళమ్మ చూడాలంటోందట అని చెప్పారు ఇంట్లో. బాబుని వాళ్ళమ్మ దగ్గర కూర్చోపెట్టుకుని ఆప్యాయంగా చూట్టం, తల నిమరటం కళ్ళల్లో నీరు పెట్టుకోటం, బాబు నాన్నగారు బాధగా వారి వంక చూడటం, బంధువులందరూ కళ్ళనీళ్ళతో చుట్టూ వుండటం నా కళ్ళముందు కనిపించింది.



ఓ కేటు సుబ్బాయమ్మ ఓ డూప్లికేటు వెంకాయమ్మ ఇంటికివెళ్ళింది. వెంకాయమ్మ ఇంట్లో గోడలవైపుచూసి, అనుమానంగా పెట్టెలవైపుచూసి సుబ్బాయమ్మ ఇలా అంది.

"ఏమిటో వదినా ! ఈమధ్య కొత్తకాలెండర్లు గోడలకు తగిలించటంమానేసి పెట్టెల్లో దాచుకోవటం ఫాషన్‌అయిపోయింది చాలా మంది ఇళ్ళల్లో ! !"

దానికి వెంకాయమ్మ ఇచ్చిన జవాబు ఇది:

"అవును వదినా ! ఇతరుల ఇళ్ళకువెళ్ళి కొత్తకాలెండర్లు పైటకొంగుల్లోను చీర మడతల్లోనూ పెట్టుకుని భద్రంగా తెచ్చుకోవటం కూడా ఫాషన్‌అయిపోయిందట కొందరికి."

ఒకవేళ ఊహించిందే జరిగితే యిప్పుడు కాకపోయినా బాగా ఊహ తెలిసింతర్వాతైనా అమ్మను గురించి బాధపడడా ? పవిత్ర మాతృమూర్తిని తెచ్చుకోలేడుకదా. అంత చలాకీగా నవ్వుతూ తిరిగే బాబుకా... ఇక ఊహించలేక తల విదుల్చుకున్నాను.

ప్రతిరోజూ ఆవిడ పరిస్థితి ఎలావుందో తెలుసుకుంటున్నాను. తర్వాత బాబు వచ్చాడు. దగ్గరకు తీసుకుని, "అమ్మకెలా వుంది" అనడిగాను.

"ఎడుకునివుంది జ్వరంవచ్చిందట డాక్టరుగారు మందులిస్తున్నారు ఇంజీషన్లుకూడా చేస్తున్నారు మరీ... నాన్నగారు, అమ్మ నాకు కనపడకుండ ఏడుస్తున్నారెందుకో" ఆలోచిస్తూ అన్నాడు. ఆవిడ పరిస్థితేం బాగోలేదట. మూసిన కన్ను కూడ తెరవటంలేదట. బాబు కంగారు పడ్తాడేమోనని తీసుకుని వచ్చేశారట.

బాబువచ్చిన రెండోరోజున ఆవిడకు ఇంజెక్షన చేయబోతే సెప్టిక్ అయి రక్తం వచ్చిందట — వినగానే నాగుండె ఝల్లుమంది. మా బాబుకి నాలుగ రోజులు జ్వరం వస్తేనే కంగారు పడ్తారందరూ, మరి వాళ్ళంతా, ముఖ్యంగా బాబు నాన్నగారు ఎలా వుంటున్నారో కదానిపించింది. నాకు తెలీకుండానే ఏం ప్రమాదం జరక్కూడదని మనసులోనే కోరుకున్నాను.

తర్వాతోరోజు పుస్తకం ముందుపెట్టుకుని కునికిపాట్లుపడ్తూ లాభంలేదని మావాడి "కీ" బొమ్మని పట్టుకుని ఆడిస్తున్నాను. ఇంతలో 'బాబు అమ్మ పోయిందట" అనేమాటలు వినిపించాయి. గుండె ఝల్లుమంది ఒక్కసారిగా భయం వేసింది. ఆ మాటలు అన్నదెవరో, ఎక్కడ అన్నారోకూడా గ్రహించలేక పోయాను.

ఆవిడ కళ్ళు తెరచిచూస్తూ అందరికీ నమస్కారం పెట్టి ఒక్కసారిగా కళ్లు మూసేసినట్లూ, బాబు నాన్న అప్పటిదాకా ఆ కళ్ళనే చూస్తూ ఆవిమాటలు పడగానే గుండెలు పగిలి రోధిస్తున్నట్లూ కళ్ళముందు కనిపించింది. అప్పటిదాకా చూస్తున్న కళ్ళను ఇక చూడలేడుకదా. ఇంకొద్ది ఘడియల్లో ఆ శరీరాన్ని కూడా జన్మలో చూడలేడుకదా. ఆ మనిషినే చూడని నాకే ఇంత బాధగా వుంటే ఇంకాయన బాధను ఊహించటానికి కూడా శక్యం కాదు. ఇవన్నీ కళ్ళముందు రీలులాగా తిరిగి పోతున్నవి. బాబు గుర్తురాగానే చేతులు వణికి నాకు తెలీకుండానే చేతిలోని బొమ్మ జారి క్రిందపడి, 'కీ' విరిగిపోయింది. ఎందుకో నవ్వొచ్చింది ... మనం తయారుచేసి కీఇచ్చి ఆడిస్తున్న బొమ్మ జారి క్రింద పడి పనికిరాకుండా పోయింది అదే బొమ్మను కాకపోయినా, అలాటి తేడాలులేని బొమ్మనే మళ్ళీకొని ఆడుకోవచ్చు. అది మానవ మేధస్సే. కాని భగవంతుడు తను తయారుచేసిన ఇలాటి గుణగుణాకారాల్నే మరల ఇవ్వలేడు కదా ఆయనకు.

కాని ఒక్క సందేహం మాత్రం మిగిలిపోయింది ఆ రోజు నా డైరీపుటలో...

"మానవుడు సృష్టించిన బొమ్మ పొరపాటున క్రిందపడి పనికిరాకుండా పోయింది మరి భగవంతుడు కూడ ఆయన సృష్టించిన పచ్చని జీవితాన్ని తెలీకుండానే పొరపాటుగా నాశనం చేశాడా? లేక సృష్టికోసం మనస్ఫూర్తిగానే చేశాడా ?

"అలా అయితే ఆయనది హృదయమా, పాషాణమా ?"

★